# ముగింపు లేదు

శ్రీ వి. కృష్ణరావు

* గత సంచిక తరువాయి *

నేను ఇంటికి వచ్చాను. సత్యానికి మాట ఇచ్చాను.

కాని, ఇప్పటి కిప్పుడే ఎక్కడికి మార్చను? ఎవ్వరు మాత్రం ఆదరిస్తారు? ఏం చెయ్యను? శాకుంతలంతో ఆలోచించడానికి శాకుంతలంకు ఏవిషయమూ అర్థం కాదు. అంతా కొత్త. ఎందుకో శాకుంతలంనుగురించి ఆలోచిస్తే శాకుంతలంకు అన్యాయం జరుగదుకదా? అనిపించింది. శాకుంతలంను అవస్థపెట్టడానికి తీసుకు రాలేదుకదా?

నేను అప్పటికప్పుడు వెంటనే వావిలాల తాతగారింటికి వెళ్లాను. ఆయన అరుగుమీద కూర్చున్నారు. రమ్మన్నారు. నాకు వెంటనే ఒక అనుమానం నన్ను చింవరవందర చేసింది. నేను ఇలా సత్యం పొమ్మన్నాడంటే, తన ఇంట్లో ఉండమంటారు. ఆయనకు లేని పోని అవస్థ తెచ్చిపెట్టినవాడిని అవుతాను. ఈవిషయం ఆలోచించగానే, నేను ఆయనతో ఈవిషయం చెప్ప దలచుకో లేదు.

నేను ఆకబురూ ఈకబురూ చెప్పి వెనుకకు వచ్చేయబోయాను. వెనక్కు మరలిన నన్ను పిలచి...

"ఇదుగో చూడు. సత్యం నిన్ను కలుసుకున్నాడా?"

నేను ఆశ్చర్యపోయాను. సత్యం నన్ను కలుసుకొన్న సంగతి ఈయన కెలా తెలుసు? నేను ఆయనదగ్గర అబద్ధం ఆడటానికి సాహసించలేను.

"అవును. ఇప్పుడే కలుసుకున్నాడు."

"ఖాళీ చేయమన్నాడా?"

నేను మరీ ఆశ్చర్యపోయాను. అవును అన్నట్లు తల ఊపాను.

"నాకు తెలుసు. ఇంకా చాలాదూరం పోతుంది వ్యవహారం. ఊరంతా కట్టకట్టుకుని నీమీద విరుచుకుపడతారు. ధైర్యం, సహనం నీకు ఇప్పుడు అవసరం. అనవసరంగా ఆవేశపడకు."

నేను నింపాదిగా బాధగా అన్నాను. "నీమీద ఇంతకు రెట్టింపుగా విరుచుకుపడ్డా నేను ఖాతరు చేయను. కాని శాకుంతలం బాధపడుతుంది. నేను అనుకుంటాను; శాకుంతలకు అన్యాయం జరగడంలేదు కదా?"

వావిలాలతాతగారు అన్నారు. "శాకుంతలం చాలా మంచిపిల్లలాకనపడుతోంది. నిన్ను అర్థం చేసుకోలేనంతటి వెఱ్ఱిగోడని నేను అనుకోను. కర్తవ్యం ఆలోచించు."

"ఆలోచించడాని కేముంది. ఇంక పదిగంటలలో ఖాళీ చెయ్యాలి."

"చేయకపోతే...?" ఆయన కంఠం కఠినంగా ఉంది.

నేను నింపాదిగా, నిశ్చయంగా అన్నాను. 'చేసి తీరతాను. సత్యానికి మాటఇచ్చాను."

ఆయన మరి మాట్లాడలేదు. ఆయనకూడా మాట అంటె వెనక్కు తీసుకొనే మనిషి కాదు. కాస్సేపాగి... "నువ్వు భోజనంచేసిరా. మరేం భయంలేదులే."

నేను మెట్లుదిగి ఇంటికి వచ్చాను. మంచంమీద ఒదిగి అరచేతుల్లో తలపెట్టుకుని ఆలోచిస్తోంది శాకుంతలం. "శాకుంతలం" అన్నాను. శాకుంతలం: 'మీరా!' అని ఆశ్చర్యపోయింది.

"ఏం? అలాఉన్నావ్?"

"ఏమీ లేదు. ఊరికి నే!" అని లేచింది. నేను భోజనంచెయ్యడానికి కూర్చున్నాక అంది శాకుంతలం.

"ఏమండీ! మనం ద్రాక్షారామ వెడితే?"

నేను విస్తుబోయాను. ఎప్పుడూ ఆశ్చర్యపోనంతగా ఆశ్చర్యపోయాను. శాకుంతలాన్ని చూసాను. శాకుంతలం కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

నేను బాధగా అన్నాను. "నీకూ తెలిసిందా? శాకుంతలం!" నాకు కూడా ఏడుపువచ్చింది. విస్తరి వదలి వెళ్ళిపోయాను.

"నీకు తెలియకుండా ఉంచాలనుకున్నాను శాకుంతలం. కాని..." శాకుంతలంను చూడలేక శూన్యంలోకి చూస్తూ అన్నాను. "నిన్ను బాధపెడుతున్నాను". శాకుంతలం పెద్దపెట్టున ఏడ్చింది. ఆ ఏడుపును భరించలేకపోయాను. ఏడుస్తూ అంది...

"మిమ్మల్ని అనడంలేదు. మీరు మంచివారు. నా రాతే...ఎప్పుడూ ఇంతే. ఇది నాకు కొత్తకాదు." తిరిగి కళ్ళనీళ్ళు కుక్కుకుంది. నా హృదయం స్పందించింది. నాహృదయం చిల్లులుపడేలా ఏడ్చింది. నేను గిలగిలలాడాను. నాకు తలపగలుకొట్టుకోవాలనిపించింది, ఆస్థితిలో; ఏం చెయ్యలేక! నాది వెధవబ్రతుకు అనిపించింది. నన్ను చూస్తే హాపలి తలుపేసుకొనేమోక, నన్ను నా ఎదురుగుండా నిలచి, ఈసడిస్తున్నారే, వెక్కిరిస్తున్నారే! వాళ్ళకి జడుస్తున్నానంటే ఏదో ఒకమూల నాలో నిస్సత్తువ ఉంది. అది నన్ను పూర్తిగా శక్తిహీనుణ్ణి చేస్తోంది!

"నువ్వు అలా ఏడుస్తే భరించలేను శాకుంతలం!"

శాకుంతలం ఇంకా ఏడుస్తూనే ఉంది. నా కాళ్లు పట్టుకుంది. కన్నీళ్ళతో అర్థించింది.

"క్షమించండి. మిమ్మల్ని బాధపెడుతున్నాను. ఇదంతా నా దేతప్పు. నన్ను ద్రాక్షారామలో దిగబెట్టండి." నేను ఊగిసలాడిపోయాను. కంపించాను. నాకు కోపం వచ్చింది. నాకళ్ళు ఎఱ్ఱనై ఉంటాయి. నిప్పులు చెలుగుతున్నట్లు వేడిగా ఉన్నాయి కళ్ళు. ఊర్రిప్రజలమీద తగని కోపం వచ్చింది. ప్రతీకారం కోసం నాలో ఉన్న ప్రతీ చిన్న అణువూ తహతహలాడుతోంది.

"శాకుంతలం. నువ్వు, నా శాకుంతలం! నీమీద ఈగవాలనివ్వను. ఇదుగో చూడు." విసురుగా, ఆవేశంగా వెళ్ళబోయాను. గోడను ఢీకొని బోర్లాపడ్డాను. "ఏమండీ!" అంటూ గావుకేక పెట్టింది శాకుంతలం. శాకుంతలం నా కాళ్ళను పెనవేసుకొంది.

"మీరేమీ ఇదవకండ. మీరేమీ ఇదవకండి."

"కాదు. శాకుంతలం. నీకు తెలియదు."

"కాదు. నామీద ఒట్టు," అంది శాకుంతలం. నాకు సంకెళ్ళను వేసింది.

"అవును. ఎందుకో అనిపిస్తోంది నాకూ. నేను శక్తిని కోల్పోయాను. నేనంటే ఉక్కిరి బిక్కిరి అయ్యే మూక నన్ను ఆడిస్తోంది. వస్తాను. నీ సంకెళ్ళు మరిచిపోను!"

ఆ కటిక చీకటిలో బాధగా వావిలాల తాతగారింటివైపు బయలుదేరాను. నేను ఎంతగానో క్షోభిస్తున్నాను. నాకు నేను హీనంగా బ్రతికినా, అనవసరంగా, నాకు తెలుసున్నంతవరకూ, నేను ఎవరినీక్షోభపెట్టలేదు. కఠినమైన మాట అని ఎవరి మనస్సూనొప్పించలేదు. ఎందుకు నాపై వీళ్ళ అకారణద్వేషం? పగ? నా గొడవ నే పడుతోంటే...అది ఇంకొకరి కొంపకూల్చడమవుతుందా? నేనే తప్పుచేసినట్లు బాధపడ్డాను. నా పరిస్థితి తెలుసుండీ, ఎందుకు ఈ బెడదపెట్టుకోవడం? ప్రతిమానవుడిలాగే, నాకు కోర్కెలు ఉంటాయి. కాని నాలాంటి వాడికి అవి పనికిరావని నేను తెలుసుకున్నాను. నేనుకోరే, ప్రతివిషయమూ వస్తువా, మిక్కిలి వింతగానూ, బరి తెగించివట్టిది గానూ ఉంటుంది మిగతావారికి! అనవసరంగా శాకుంతలకు బాధకల్గిస్తున్నాను. చిన్నప్పటినుంచీ,ఏదోకష్టపడి, చివరికి, ఒక ముసలావిడ ఆసరాతో సుఖంగా కాలక్షేపం చేస్తున్న శాకుంతలంను పెద్ద ప్రయోజకుడిలా తీసుకువచ్చాను. శాకుంతలంను ఎలా ఊరడించాలి? ఇంకా శాకుంతలం మంచిది. ఎంతో సహనం కలది. లేకపోతే, ఇంకా దుర్భరంగా ఉండేది. కాని క్షణకాలం అదే మంచిదనుకున్నాను. ఈ మానసిక సంక్షోభంకంటె ఆశారీరకవ్యథే నయం. శాకుంతలం సహనము, మంచితనము నన్ను క్షణ.క్షణమూ బాధ పెడుతున్నాయి.

నన్నూ, శాకుంతలాన్ని కేంద్రంలో పెట్టి ఊళ్లో ఉన్న జనం యావన్మందీ పరిధిమీదనుంచొని రాళ్ళు విసురుతున్నట్లనిపించింది. నాకు మళ్లీ తిరిగి ఆవేశం వచ్చింది. ఊళ్ళో జనానికి తగినసమాధానం చెప్పితీరతాను! ఇలా ఈ మాట అనుకుంటూంటే నాశరీరం అంతా వేడితో భుగభుగమంది. నేనంటే ఏమిటో వాళ్లకు తెలియాలి!

వెనక ఒక భీకరకంఠం భయం గొలిపేలా నవ్వుతోంది. ఆకంఠం బద్దలయి నవ్వుతోంది. నవ్వు ఆపి అంది "ఊళ్లో జనానికి నీవు సమాధానం చెప్పబోయి, నీకు నీవు సమాధానం చెప్పుకుంటావు."—చెమట బిందువులు నుదుటి నిండా అలుముకున్నాయి. గొప్పు తగిలి బోర్లా పడబోయాను. దారిలో సత్యం కనపడ్డాడు.

సత్యంతో అన్నాను, చాలా నిశ్చయంగా. "నేను ఇప్పుడు" ఖాళీచేయను. సత్యం కలవరపడ్డాడు. "ఎలా? వారందరితో చెప్పి సమాధాన పరిచానే!" నాకు కోపం వచ్చింది. నేను అన్నాను. "ఏం, సమాధాన పరచకపోతే. ఉరిపోసుకుంటారా?" సత్యానికి తెలుసు నా తడాఖా! నేను నేనుగా ఉంటే భయంలేదు. కాని నాకంఠం తీరు ఏమాత్రం మారినా కిక్కురుమనడు. సత్యం అన్నాడు నింపాదిగా, నమ్రతగా!

"చాలా కష్టం. నువ్వు ఖాళీచేసి తీరాలి! నీకు గదులు ఇచ్చినందుకు నన్ను నలుగురూ నాలుగు మాటలూ అన్నారు. రేడియో వినడానికి రోజూ వచ్చే గురుమూర్తి, వాసుమూర్తి, విష్ణుశాస్త్రి, కృష్ణ సోమయాజులు ఇందుకే రావడంలేదుట! వారణాసి సుబ్రమణ్యం గారు సరేసరి. మనస్నేహం మీద గౌరవముంచి నువ్వు ఖాళీచేస్తావనుకుంటాను."

"మనస్నేహం మీద నీకు గౌరవముంటే నువ్వు వాళ్ళని ఎందుకు ఖండించలేవు? ప్రజాసేవకుడవు అని చెప్పుకునే నీవు అధర్మాన్ని ఎందుకు అరికట్ట ప్రయత్నించవు?" సత్యం ఫక్కున నవ్వాడు. నాకు తల తిరిగింది వాడి వికారానికి. వాడు విడదిసి నొక్కి నొక్కి అన్నాడు "అధర్మం!...అధర్మం!!" తిరిగి నవ్వాడు 'ఎంత పిచ్చివాడివిరా' అన్నట్లు! మళ్ళీ మొదలు పెట్టాడు.

"నువ్వెంత అమాయకుడివిరా! వాళ్లది అధర్మమే కావచ్చు. ధర్మం, న్యాయం నీవైపే ఉండవచ్చు. వాళ్ళు నీకు తలపెట్టింది అన్యాయం కావచ్చు. కాని వాళ్ళని నమ్మిన నేను, వాళ్ళసహాయం కావలసిన నేను, వాళ్ళ ఆదరాన్ని ఆశించిన నేను, వాళ్ళది అధర్మమైనా, అన్యాయమైనా, వాళ్ళనీడలోనే ఉండాలి. ఇది తప్పనిసరి. రాజకీయ లౌకికుడు, ఏదో ధర్మం అంటూ, ప్రజాసేవయే తన పరమావధి అంటూ, పతితోద్ధారకుడు, దీనజన బాంధవుడులాంటి పదాలు తగిలించుకోవడం కోసం, ...ఒక్కడికోసం, పదిమంది సహాయాన్ని, బలాన్ని త్యాగంచేసుకోలేడు. ఇంకా చెపుతాను, ఇది పూర్తిగా నామాట. నాకు ఆస్థిపాస్తులు లేవు. రాజకీయం, జులాయివాడి కడపటి ఉద్యోగం అన్న నాకు వర్తిస్తుంది. ఆస్థిపాసులు లేవు. పలుకుబడి లేదు. చదువు లేదు. ఉద్యోగంలేదు, నేను బ్రతకాలి. పిల్లల్ని పోషించాలి. ఎలాపోషించను. కూలి చేయలేను పరువుగా బ్రతకాలి. ఏం చేయమంటావ్? అంచేత రాజకీయాన్ని ప్రజాసేవకైగాక, ఒక ఉద్యోగంగా, బ్రతుకుతెరువుగా తీసుకున్నాను. ఎవరైనా ఏంచేస్తున్నావంటే ప్రసిడెంట్ అంటాను. పోతే...ఇప్పటి విషయం. నువ్వు వెళ్ళనంటే నే చేసేదేమీలేదు. చెయ్యలేను. నీ సంగతి నాకుతెలుసు. నీతో రొష్టుపడ్డం నాకిష్టంలేదు. అలాగని నావలన నీవు ఏవిధమైన సహాయం పొందలేవు. నేను పదిమంది చేతుల్లోని ఆటవస్తువుని. పదిమందికీ ఇష్టమైన ఆట ఆడాలి. వాళ్ళని కవ్వించాలి. నవ్వించాలి. ఏగాలికి ఆఊగు ఊగాలి. "అన్నిబొమ్మలకంటె ఈ బొమ్మ మంచిదనిపించుకోవాలి." అదే నా జీవితాశయం. అపుడే నాకు మంచి భవిష్యత్తు ఉంది.

నువ్వు నానుండి ఏవిధమైన సహాయమూ ఆశించకు. నాకు సహాయం చేయలేకపోయినా, నీసహాయాన్ని నేనుకోరతాను. నేనున్న పరిస్థితి అట్టిది. నేను నీకు మంచితనం చూపకపోయినా, నీమంచితనం నాకు కావాలి. నా రాజకీయపు ఉద్యోగం అట్టిది. నాకల్లాంటి పట్టింపులు లేవు. పట్టింపులుంటే మాకు కుదరదు. నీకు సహాయం ఏవిధంగానూ చేయలేనని నాకు తెలుసుండే, నిన్ను నాకు సహాయం చేయవలసిందిగా కోరతాను. నువ్వుచేస్తావనికూడా తెలుసు. నువ్వు ఉదారుడివి. చివరన ఒక ముక్క చెపుతాను. అది వింటావని నేను అనుకుంటాను. నువ్వు రేపు ఉదయానికి ఇల్లు ఖాళీచేయకపోతే నాఉద్యోగానికి రాజీనామా ఇస్తాను."

వాడు చెపుతున్నంతసేపూ విన్నాను. వాడు చెప్పినదంతా నిజమనిపించింది. వాడు ఏమీ చేయలేడు. ఏమీ చేయలేని అసమర్థుడు. పిరికిపంద. కాని చిత్రం! వాడు అసమర్థుడనని చెప్పుకోగలిగే సమర్థుడు. పిరికిపందను అని పైకి బాహాటంగా చెప్పగలిగే ధైర్యవంతుడు. ఓటమిని మొదటే అంగీకరించి, ఎదురు పందెం వేయక, చివరకు, గెలుపును తనదిగా చేసుకొనే రాజకీయ లౌకికుడు. అవసరమైనచోట ఏ పలుకుకు ఆ పలుకును చెప్పగలిగే చిలకనోటిని కలిగి అందరిదగ్గరా "తలలో నాలిక" అనిపించుకోగలిగే రాజకీయ చతురుడు. సత్యం చిన్నప్పటినుంచీ అంతే. స్వలాభాపేక్షను అడుగడుగునా ప్రదర్శిస్తాడు.

దానికై చెప్పి పొందుతాడు. ఇప్పు డతని లౌకికం, చతురత, నిరాడంబరత, పరాకాష్ఠను అందుకున్నాయి. చివరన వాడి రెండుచేతులూ పుచ్చుకొని అన్నాను.

"నిన్నేమీ అనలేను. నాస్నేహం నీకెప్పుడూ ఉంటుంది. నీకు అడ్డురాను. పదిమందిచేత ఔను అనిపించుకో! నేను అలానే ఖాళీచేస్తాను" అన్నాను. నేను రెండు అడుగులు ముందుకు వేసి, ఆగి, సత్యాన్ని పిలచి అన్నాను.

"ఒరేసత్యం...నువ్వింకా మంచివాడివిఔతావు. నాసామాను అదీ బయట పారేయి; రేపు. నిన్ను నేనేమీ అనను. నన్ను నానామాటలు కూడా అను."

సత్యం ఖిన్నుడయ్యాడు. చాలా బాధపడ్డాడు. "నీకు బాధపెట్టడం సరదా అయితే ఏడిపించు. నిన్ను ఏమీ చేయలేను, అనలేను కాబట్టే రాజీనామా ఇస్తానంటుంట." నేనుకూడా వాడి మాటలకు కరిగి పోయాను. వాడి వీపు తట్టాను. "నీకు మంచి భవి ష్యత్తు ఉన్నదన్నట్టు."

వావిలాల తాతగారింటికి వచ్చాను. ఆయన ఇంకా మెలుకువగాఉన్నారు. వీధిఅరుగుమీదమంచం మీద పడుకొన్నారు. నేను వెళ్ళగానే ఆయన లేచి కూర్చున్నారు. నన్నుకూడా ఆయనప్రక్కనే కూర్చో వలసినదిగా బలవంతంచేశారు. కూర్చున్నాను. కూర్చో గానే, ఒక్కమాట ... "నువ్వెందుకు మీ పొలంలో ఉండకూడదు."

"పొలంలోనా!?"

"అవును. ఏం ఆ మెరకచేలో పాక ఉందిగా. అది శుభ్రంచేయించి ఎందుకు ఉండగూడదు. అంతా బాగుచేసి ఊరికి ఫర్లాంగుకూడా ఉండదుకదా! నాఇంట్లో మీరుంటే నాకు అభ్యంతరంలేదు. కాని మీరుండరు. ఉండలేరనీ తెలుసు ... పైగా అక్కడ ఉండడంలో నీవు ఇంతకన్నా ఎక్కువ సుఖపడ్డం ఒకటి ... పైగా ఖాళీగా ఉన్నావు. ఏదైనా పని ఉండాలి, చూడు, మనిషికి. వ్యవసాయం అంటే ఏమిటో ముందు కొంత తెలుసుకుంటే...తర్వాత అదే ఉపయోగపడవచ్చు."

నాకు వావిలాలతాతగారు మంచివారేకాకుండా ఎంత తెలివైనవారయినదీ బోధపడింది. సున్నితంగా తిట్టడంలో ఆయనే నేర్పరి. ఆయనమాటల్లో ఎంతో భావం ఉంది.

"తాతగారూ ... మీరుణం ఎలా తీర్చుకోను? ఒకనిర్ణయం, ఒక తెన్నూ లేకుండా తిరుగుతున్న నాకు రూపురేఖలు దిద్దుతున్నారు. మీ కేవిధంగా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలియకుండా వుంది" అన్నాను.

ఆయన నవ్వుతూ అన్నారు. "ఎంత అమాయ కుడివి బాబూ! నేచేసిం దేముంది? పోయి రామన్నను పాక అదీ శుభ్రంచేయమను; కావలసివస్తే మా పాలేరు కూడా సాయపడుతాడు."ఆయనదగ్గర సెలవు తీసుకొని, ఆరాత్రే రైతు రామన్నను కలుసుకొని, విషయాన్ని బోధపరచి, చేయవలసినపనిని చెప్పాను. రైతు రామన్న ఉత్సాహం, సంతోషం, యజమాని సంతృప్తికై చేసేపనిలో తనతృప్తి ప్రదర్శించాడు మౌనంగా!

ఆమర్నాడే పొలంలోని మామిడి మొక్కల దిబ్బ మధ్యనున్న పాకలో మకాం పెట్టాను. ప్రక్కనే పంట కాలవ సన్నగా వంకరులు తిరిగి ప్రవహిస్తోంది. ఎదురుగా పైరులో నిగనిగలాడుతూ పచ్చని పల్లపు పైరుచేను వెనకాల...ఏపుగా పెరిగిన పచ్చగడ్డిమైదానం కుడిచేతి వైపు చామర్తివారి కొబ్బరితోపు ఎంతో అందంగా ఉంది. అక్కడ నిర్మలంగా, స్వచ్ఛమైన గాలి వీస్తోంది. ఇంకా ప్రజల్లో పడి అదిమలినం కాలేదు. శకుంతలంను పిల్చాను. శకుంతలం వంగి పాకలోంచి ఇవతలకు వచ్చింది.

"మాడు శకుంతలం...మనం ప్రకృతిని చూడాలంటే మనం ప్రకృతికి తలవంచి రావాలన్నట్లు మనం వంగిరావాలి ఇంటిలోనుంచి."

"ఎక్కడున్నా, ఎవరితో మాట్లాడాలన్నా, తలవంచి మాట్లడ్డమే అలవాటు" ఆమె మాటల్లోని బాధను నేను గ్రహించాను. వెంటనే మాటల సంద ర్భాన్ని మార్చాను.

పొలంలో మకాం బాగానే ఉన్నట్లని పించింది. శకుంతలం కూడా సౌఖ్యంగా ఉన్నట్లు తోచింది నాకు. ఆమె బాధగాని, సౌఖ్యంగాని పైకి ఎప్పుడూ వ్యక్తం చేయదుకదా? శకుంతలంకు తోచడం కష్టమేమో అనుకున్నాను. ఎప్పుడూ నాతో అనలేదు. ప్రతిరోజు ఉదయం చద్ది రామన్నకు రామన్నభార్య పట్టుకువచ్చేది. రామన్నభార్య, శకుంతలంకు కొంత కాలక్షేపం. ఇకపోతే శకుంత

లంతో మాట్లాడేవారే లేరు. వావిలాల తాతగారు అప్పుడప్పుడు వచ్చేవారు. నేను, గడ్డో గాదమో దగ్గర ఉంటే చూసినవ్వేవారు. ఆనవ్వు ఎంతో ఆదరంగాను, అర్ధవంతంగానూ, ప్రోత్సాహకరంగాను ఉండేది. ఎందుకో నాకూ అనిపించేది అప్పుడపుడు నేను సాదా మానవుణ్ణి కాగలిగాను అని. అలా అనుకుంటూంటే నాకళ్ళు అశ్రుపూరితాలయ్యాయి, ఆశ్చర్యంతో చకితుణ్ణయ్యేవాడిని! శాకుంతలం ఎవరు? నేను ఎవరు? నాకు అర్థంకాక కాస్సేపు తికమకపడి ఆధోరణినుండి బలవంతంగా తప్పించుకొనే వాడిని.

పోతే...ఊరివారికి మేము ఇక్కడున్నా కష్టంగానే ఉండచ్చు. మేము ఇక్కడ ఉండడం వారికి ఒక ఉత్సాహకరమైన చర్చనీయాంశం తొలిగినట్లవుతుంది. ఆసలు నాకేబాగు లేదు. వీళ్లు నాగురించి ఏమనుకుంటారో వినాలని ఉంటుంది. ఏమిటీ దౌర్బల్యం వాళ్ళకిదూరంగా ఉండడం కూడా కాస్తకష్టంగానే ఉంది. ఈ దౌర్బల్యం తప్పతే...మిగతా విషయాలు బాగానే ఉన్నాయి.

నేను అనుకున్నాను...ఊరివాళ్లు మేము వాళ్లను విడచినా, మమ్మల విడవరు. నాకు వాళ్ల మనః స్తత్వం తెలుసు. వెంటనే నేను నవ్వుకున్నాను. ఏమిటిపగ? పోనీ అనుకుంటే అనుకుంటారు కాని వాళ్ళు చేయగలిగిందే ముంది గనక? వావిలాల తాతగారు చెప్పింది మాత్రం నిజం. మిత్రుల మంచిని గోరంత ఉంటే కొండంతచేసి చెపుతాం. కిట్టనివాళ్ళ చెడునే ఊహించడం, పెద్దదిచేసి చెప్పుకోవడంలో నేసంతృప్తి. మనలో ఉన్నలోటును భర్తీచేసుకొన్నట్లనిపించడం సహజం. ఊరివాళ్లు ఏమనుకుంటే నేం? వాళ్ల అనుకోవడాన్ని. మనం ఓనాలుగు అనాలి అనిపించడం లేదు కదా? గాలిలో ఒక చేయి విసరితే చప్పుడవుతుందా? చకుముకిరాయికి నిప్పురవ్వలు విసిరే ప్రభావం ఉంటే మటుకు...ఒక రాతిముక్క సహకరిస్తే తప్ప అది ప్రకాశించదు, ప్రజ్వలించదు. మనం దూరంగా ఉంటే సరి.

శాకుంతలంతో "ద్రాక్షారామ పోయివద్దామా అన్నాను" వద్దంది. బామ్మగారు చీరో, నారో అంటుందిట! ద్రాక్షారామ ఆమె వద్దనడంలో ఇంకా కొన్ని కారణాలు ఉండవచ్చు అనుకున్నాను. ద్రాక్షారామ విడచిపెట్టి ఎంతో కాలం కాలేదు. శాకుంతలం మీద విమర్శలు. అభాండాలు ఇంకా తాజాగానే ఉండవచ్చు. అదికూడా ఒక కారణం అనవచ్చు. శాకుంతలంను అడగలేదు "నిజం కదూ" అంటూ? బాధపడుతుంది. బాధపడి ఊరుకోదు భోరుమని ఏడుస్తుంది. శాకుంతలం ఎందుకో బాధపడుతుంది లోపల. నన్ను చూస్తే లేనినవ్వు తెచ్చుకొని పేలవంగా నవ్వుతుంది. తెల్ల చీరలమీద చూపే ఆమె మక్కువ రంగు చీరెలమీద చూపదు. పూర్వ విషయాలు అనుక్షణమూ ఆమెను నీడలా వెంటాడతాయి అనుకుంటాను. ఆమెను నవ్వించాలని, పూర్వ విషయాలు మరిపించడానికి "చిటకాలు" వాడతాను.

"అవును. నువ్వు ద్రాక్షారామ పోను అనడంలో బలీయమైన కారణం ఉంది." అన్నాను.

"ఏమిటి" అని ఆత్రుతగా అడిగింది. ఆమె ఎందుకంత ఆత్రుతపడిందో నాకు తెలుసు. ఆమె పడిన "భయాన్ని" నేను కనిపెట్టాననే భయం!

"అదికాదు శాకుంతలం. నువ్వు ఒక్కర్తివి ఎలా పోగలవ్? బామ్మగారికి మాట ఇచ్చావుగా?" నవ్వుతూ అన్నాను. ఆమె నవ్వింది!

రామన్న చేస్తున్న దైనందిన వ్యవసాయ వ్యాపారాన్ని చూస్తూ నేర్చుకోవడమే నాదైనందిన వ్యాపారం. పాపం! రామన్న అనుకొని ఉంటాడు "వ్యవసాయం చూడ్డం ఈయనకు సరదా" అని. ప్రతీరోజూ కొన్ని పాఠాలు నేర్పేవాడు. ఇదే తనకు ముందు 'చెడు' అవుతుందని ఎలా ఊహించగలడు? వ్యవసాయ పద్ధతులు ఆరోజు కారోజు బాగా తెలియసాగాయి!

పంట కోసాక, నాకివ్వవలసిన మగతా నాకిచ్చాక, నా అభిప్రాయాన్ని రామన్నకు చెప్పాను. రామన్న నిలువునా నీరయిపోయాడు. రామన్న తల మీద తువ్వాలుగుడ్డను చేత్తో పట్టుకొని ఇంటికి నడిచాడు. రామన్న భార్య శాకుంతలంతో, ఏమి మాట్లాడిందో, ఏమో, నాతో "సాంత వ్యవసాయం వద్దంది శాకుంతలం. "మరి నాకు తోచడ మెలా?" అన్నా వినిపించుకోలేదు. పరిస్థితి వావిలాయనకు చెప్పాను. ఆయన "పాలు వ్యవసాయం" ఏర్పాటు చేసారు. ఇదీ బాగానే ఉంది.

వ్యవసాయం ఎంతో ఉత్సాహం, ఆనందం ఇచ్చింది నాకు. మొదటిఏడు పంట చాలా ఉత్సాహ

పరిచింది. ఎంత ఉత్సాహ పడ్డానంటే, 'పాలు వ్యవసాయం' కూడా మాని సొంత వ్యవసాయం పెట్టి అంతలాభం నేనే అనుభవిద్దా మనుకున్నాను. రామన్న మంచితనంగాని, రామన్న భార్య సహాయ సహకారాలుగాని నన్ను చలింపజేయలేదు. స్వలాభ అపేక్ష నన్ను నికృష్టంగా తయారు చేసింది. ఇంతలాభం... రామన్న సహకారంవలన వచ్చిందని నేను అనుకో లేదు. నాచేను నాకు పంటనిచ్చింది అనే భావన తప్పుతే! చేనుయొక్క యజమానిని నేను. దానిఫలం అనుభవించవలసింది నేను. ఎవడో రామన్న నాకు నా పంటలో భాగస్వామి కావడ మేమిటి? అయితే నా ఆలోచనలు నాలోనే ఉండిపోయాయి. శకుంతలంతో గాని, వావిలాల తాతగారితో గాని ఈ విషయం సంప్రదించలేక పోయాను. భయపడ్డాను. ఎందుకు భయం? నా సొంత చేనును నా అధీనంలో పెట్టుకుంటే తప్పేముంది? దానికి భయం ఎందుకు? భయపడుతున్నానంటే.. అంతరాత్మ ఎందుకో వెనకాడుతున్నదన్నమాట! "తప్పు"ను చేస్తున్నపుడు ప్రతీ వాడూ భయపడుతాడు. అంతరాత్మ హెచ్చరిక 'భయం'గా కనపడుతుంది. భయంను, తనకు తాను పోగొట్టుకోవడానికి ప్రయత్నించడమే అంతరాత్మకు విరుద్ధంగా నడవడానికి ప్రయత్నం అన్నమాట!

సరే...రెండో ఏడుకూడా పాలు వ్యవసాయమే!

వావిలాల తాతగారికి కాస్త నలతగా ఉందంటే నేను వెళ్లాను, ఆయన నవ్వుతూ పలకరించారు. "ఏమీ లేదు. మామూలు నలత, వార్ధక్యం కదూ!" ప్రతి రోజూ వెడుతూ చూస్తూ వస్తున్నాను. ఆయన 'నలత' ఆయనను అంతకంతకు దిగజార దీసింది. చివరకు తీవ్ర పరిణామానికి తీసుకుపోయింది!!

భోజనానికి కూర్చుంటే కెవ్వుమన్నట్లు వినవచ్చింది. రామన్న భార్య పరుగున వచ్చింది. నేను వెళ్లాను: ఆయన మాట్లాడే స్థితిలో లేరు. పూర్తి మగతలో ఆయన ఉన్నారు. తిరిగి వచ్చాను.

ఆయన కన్ను మూసారు!! నేను కూడా, ఆయన భౌతిక దేహం వెనక నడిచాను. మానవాళి గమ్యస్థానం రుద్రభూమి. చిన్నా, పెద్దా, చివరకు, అంతా అక్కడకు చేరుకోవలసిందే. నదులన్నీ చేరేది చివరకు సముద్రానికి అలానే...మానవాళిలో ఉన్న తరగతులు-ఎత్తు పల్లాలు—పెద్ద చిన్నలు—అంతా సమ మట్టం కావలసిన బల్లపరపు నేల అది. అందర్నీ, ఎవిధమైన తేడా లేకుండా, సమాన ఔదార్యంతో స్వాగతమిచ్చే పుణ్యభూమి అది. చితిపై పేర్చిన వావిలాల తాతగారి మౌనముద్రతో కూడిన ఆయన ముఖాన్ని ఒకసారి చూచి, కడసారి నమస్కరించి, తిరిగి వచ్చాను బాధగా, బరువుగా!

ఇంటికి వస్తున్న నన్ను రామన్న భార్య పరుగున వస్తూ, ఆపింది. రొప్పుతూ వచ్చింది. ఏమిటన్నాను భయంగా!..."అమ్మకు నొప్పులు!!"

"ఎవరు దిక్కు?" అనుకున్నాను. శకుంతలం నొప్పులతో పెద్దపెట్టున రోదనచేస్తోంది. వెంటనే రెండుమైళ్ళదూరాన ఉన్న గవర్నమెంటు ఆసుపత్రిలో చేర్పించాను. నేను ఎంతో ఆనందమైన మాటవింటాను అనుకున్నాను. ఆ బాధలో నాకు చల్లనివార్త వస్తుందని ఆశపడ్డాను. నిద్రాహారాలు లేకుండా రెండు రోజులు శకుంతలం దగ్గర కూర్చున్నాను. ఆ నొప్పులతో మరణయాతన పడుతూ చెప్పింది.

"నేను బ్రతకనండీ!"

"ఛ"

నా మాటలు వినిపించుకో లేదు. తిరిగి తిరిగి అదే మాట చెప్పడం.

"పుట్టిన బిడ్డ అయినా కులాసా గా ఉంటే..." —శకుంతలం నోటికి అడ్డు వేసాను. నాతల తిరుగుతోంది శకుంతలం పరిస్థితిచూస్తే. విసురుగా భయంగా డాక్టరును కలుసుకొన్నాను.

"డాక్టర్ ఏమిటది?"

"అనవసరంగా ఆవేశపడకండి." అని మందలించాడు నన్ను.

"కాదు డాక్టర్, ఆమె బ్రతికి తీరాలి. ఎంతైనా ఖర్చుపెడతాను."

"ఖర్చు పెట్టగలరు. తెలుసు. తల్లో బిడ్డో మాత్రమే దక్కచ్చు. ఎవరోఒకరు త్యాగంచేయాలి."

నాకు ఇది పరీక్ష. శకుంతలమే కావాలి. డాక్టర్."

"సాధ్యమయితే, భగవంతు డనుకూలిస్తే ఇద్దరూ కులాసాగా ఉండవచ్చు!"

నేను గది ఇవతలకు వచ్చాను. ఆ రాత్రి శాకుంతలం చాలా ఖంగారు పెట్టింది. ఆమె పడిన మరణ బాధ ఇంతింత కాదు.

"ఏమిటి శకుంతలం?" పిచ్చిగా అన్నాను. నాకు ఏం మాట్లాడుతున్నానో కూడా తెలియదు.

"ఏమీ లేదు. ఈ రాత్రి గడవడం కష్టం."

"అలా వీల్లేదు. నువ్వు బ్రతుకుతావ్."

"నాకు తెలుసు." నాచేతిని ఆమె చేతిలోకి తీసుకొంది.

"మిమ్మల్ని ఒకటి కోరుతున్నాను." అశ్రుపూరితాలయ్యాయి ఆమె కళ్ళు. నేనెప్పుడూ ఊహించలేను అల్లాంటి పరిస్థితిని ఎదుర్కొంటానని.

"చెప్పు శా!" గాద్గదికంగా అన్నాను.

"ఏమీ లేదు. పుట్టేబిడ్డ..." భోరుమని ఏడ్చింది. అంత బాధను ఆమె ఎలా భరించగలుగుతోందో! "బ్రతికితే, భగవంతుడు అనుకూలిస్తే, బాపుగారికి..." మాట పూర్తి కాకుండానే ఆమె విరుచుకు పడిపోయింది ఆ నొప్పులలో ఆమెకు మగత కూడా వస్తోంది. నన్ను నర్సువచ్చి బయటకు పంపింది. డాక్టరును కలుసుకొన్నాను.

"శాకుంతలం అధ్వాన్న పరిస్థితిలో ఉంది. వెళ్ళండి." జేబులోనుంచి నలిగిన వందరూపాయల నోటును ఇవ్వబోయాడు. ఆయన వారించారు. నన్ను తట్టుతూ "నీ పరిస్థితి విన్నాను. నాకు అర్థంఅయ్యింది. డబ్బూ, ఖంగారు ఈ పరిస్థితిని తప్పించలేవు దైవాన్ని ప్రార్థించు. శాకుంతలంను నర్సులు చూస్తారు. నేచేసేదేమీ లేదు. చేయవలసిందంతా చేసాను."

నేను ఏమీమాట్లాడకుండా శాకుంతలం గది దగ్గరకు వచ్చాను. శాకుంతలం మరణయాతన పడుతోంది లోపల. ఉండలేక డాక్టరుదగ్గరకు వచ్చాను. డాక్టర్ అవబోయి తగ్గిపోయాను. తిరిగి శాకుంతలం గదిదగ్గరకు వచ్చాను. అడవిబాధ! మరణయాతన! నరకంలోపడి నట్లు గిజగిజలాడుతోంది. పెద్దపెద్ద కేకలు! భరించలేను. శాకుంతలం ఎప్పుడూ అలాఅరవదు. అలా అరవగా విన లేదు. ఇది శాకుంతలంకాదు. "శాకుంతలం!" అని గట్టిగాఅరిచాను. నర్సువచ్చి డాక్టరు గదిలో నన్ను బంధించింది. క్షణక్షణమూ భయపడుతున్నాను. విన్నాను. ఆడబిడ్డను కని శాకుంతలం కన్నుమూసింది!

నావిలాల తాతగార్ని విడిచినట్టే శాకుంతలంను కూడా విడిచాను. ఎంత భయంకరమైన ప్రదేశంఅది. అగ్ని ప్రచండమూర్తిఅయి, దాహం చాలదన్నట్లు నాలికలు చాపుతున్నాడు. శాకుంతలం ప్రశాంతంగా మంటల అలలపై నిద్రపోతోంది!

ఎవరీ శాకుంతలం? ఎక్కడపుట్టింది? ఎక్కడ పెరిగింది? నేను ఎవరిని? చివరికి...నాచేతిలో... ఇక్కడ...బుగ్గిఅయ్యింది. పోతూ, పోతూ, ఒక బాధ్యతను ఇచ్చి వెళ్ళిపోయింది!

ఈ కష్టకాలంలో రామన్న భార్య చేసిన సహాయం అపూర్వం. నేను ఎప్పుడూ మరిచిపోను. ప్రొద్దుపోయి రామన్న ఇంటికి వెళ్ళాను. రామన్న చెడీమీద కూర్చున్నాడు. నన్ను చూసి లేచి "రండి" అన్నాడు. రామన్న భార్య పిల్లకు ఆవుపాలు పడుతోంది. తల్లి లేని పిల్ల! నాకు విచారం పెల్లుబికింది. ఏదో చెప్పాలని సంకల్పం. మాటలు రావు.

"రామన్నా మీ ఇద్దరి ఋణం నేను ఎలా తీర్చుకో నేది?"

"మాదేముంది బాబూ!"

"నేను ద్రాక్షారామ వెడతాను."

"వెళ్ళిరండి. మనసు కుదుటబడుతుంది." అన్నాడు.

"మనస్సు కుదుటబడ్డానికి కాదు రామన్నా. పెద్ద పని ఉంది. చాలా పెద్దపని. నా బాధ్యత వదిలించుకోవడానికి రామన్నా. నాది వెధవ బ్రతుకు. వెధవలాపుట్టి వెధవలా పెరిగాను. నేను ఎవరికీ సహాయం చేయలేదు గాని అందరి దగ్గరా సహాయం పొందాను. మీకు కృతజ్ఞుణ్ణి."

"ఏమిటి బాబూ!

"రేపు ఉదయం పిలను తీసుకు వెడుతున్నాను."

"ఎక్కడికి" రామన్న భార్య అంది ఆశ్చర్యంగా.

"ద్రాక్షారామ!"

"మీకు అభ్యంతరం లేకపోతే..."

"అభ్యంతరం ఏముంటుంది? ఏమీ ఉండదు. దీనిపై నాకు ఏ విధమైన అధికారమూ లేదు. ఇది శాకుంతలంబిడ్డ. శాకుంతలంకు మాట ఇచ్చాను. నెరవేర్చాలి."

ఇద్దరూ మాట్లాడలేదు.

నేను ఉదయమే ద్రాక్షారామ బయలుదేరి వెళ్లాను. ఇంకా అలానే ఉంది హోటలు. సరిగా పన్నెండు దాటింది. బామ్మగారు ఉన్నారు. నన్ను చూసి ఆశ్చర్యపోయారు. చేతిలో పిల్లను చూసింది. ఆమె బెదిరింది. నేను బావురుమన్నాను.

"ఏం జరిగింది నాయనా?"

"మీ శాకుంతలంను, మీకూ, నాకూ కూడా లేకుండా చేసుకున్నాను. ఇది మిగిల్చింది తన గుర్తుగా!"

కథ చెప్పాను. ఆవిడ వింది. ఆవిడ కృంగిపోలేదు. ఏడవనూ లేదు. "అంతా విధి విలాసం. దీనికి ఎవరు బాధ్యులు? ఎవ్వరూ కారు. అందరూ ఔను. ఏది అన్నా చెల్లుతుంది. శాకుంతలం ఎవరు? నేను ఎవర్ని? నువ్వెవరవు? ముగ్గురూ ఒకొరికొకరు తెలియదు. సంబంధం ఏర్పడింది. ఈ సంబంధం మనం ఏర్పరచు కున్నామా? మన తెలివా? ఇది మనం పోగొట్టు కొన్నామా? శాకుంతలం మాట కాదనను పెద్ద శాకుంతలం పోయి చిన్న శాకుంతలం వచ్చింది. ఇటివ్వు."

ఇచ్చుకున్నాను. ఆవిడ సమాధాన పరుచుకోగలి గలిగింది. మరి నేను. ఏడ్చాను. "ఏమిటి నాకు ఈ శిక్ష? శాంకుంతలం పోతూ, పోతూ, నాకెందుకు వేసినట్టు ఈ కఠినమైన శిక్ష?"

"అనవసరంగా మధనపడకు; శిక్ష ఒకరు వేసేది కాదు. తీసేది కాదు. అనుభవించడమే. అంతే. భోజనానికి లే!"

"నేను ఉండలేను బామ్మగారూ! నన్ను వెళ్ళనివ్వండి. తల్లి, తండ్రీ లేనిపిల్ల అనాథ."

"ఛ! తప్పు నాయనా! వెళ్ళిరా!"

అలా అప్ప చెప్పి తిరిగివచ్చేసాను. నేను ఏ పనీ చేయుటలేదు. శూన్యంలోకి చూస్తూ—పూర్వ విషయాలను జ్ఞాపకం చేసుకుంటూ కూర్చోవడమే. రామన్న, రామన్న భార్య నా గురించి శ్రద్ధ తీసుకొనేవారు.

ఒకరోజు నా ఇల్లుకొనుక్కొన్న ఆసామీ వచ్చాడు. ఎందుకని అడిగాను.

"ఒక కోరిక!" అన్నాడాయన నమ్రతగా.

"ఏమిటది!"

"ఏమీ లేదు. నువ్వు ఉదారుడివి. నువ్వు ఒప్పుకుంటావని తెలుసు. చూడు నాయనా, ఏదో ఇల్లు కొనుక్కున్నామంటె, నాలుగు కాలాలపాటు సుఖంగా ఉండాలనుకుంటాం."

"అవును. ఇప్పుడేం జరిగింది.?"

"ఏమీ లేదు. ఎప్పుడూ ఇంటిలో...ఒక తెల్ల చీర, రవిక కట్టుకొని ఒక స్త్రీ ఆకారం మసులుతోంది. చూడబోతే...నీ..."

"శాకుంతలమా?"

"అవును. పిల్లా జెల్లా కలవారముకదా! అప్పు చేసి ఇల్లుకొనుక్కొన్నామా మరి? నీ ఇంటిలో మేం నాశనమయ్యాము నే పాడు పేరు నీకొద్దు నాయనా!"

"నన్ను ఏం చేయమంటారు?"

"వాపసు"

"మరి డబ్బు..."

"నువ్వికొన్న..."

"అలాగే..." అని దృఢంగా అన్నాను.

ఒకరికయినా సహాయపడ్డాననే తృప్తి నాకు మిగులుతుందని ఆశపడ్డాను. పైగా శాకుంతలం పిలుస్తోంది నన్ను రమ్మన్నట్లు. ఆమె కోరికను నేను ఎప్పుడూ కాదనలేదు. ఇప్పుడుమాత్రం ఎందుకనాలి? "అలాగే శాకుంతలం" అని అనుకున్నాను.

తర్వాత రెండెకరాల ఆస్థి ఆయనకు వ్రాసి నా ఇల్లు నేను పుచ్చుకున్నాను. రామన్న, రామన్న భార్య నా తెలివితక్కువకు నొచ్చుకున్నారు. వాళ్లకు తెలియదు. చెప్పినా అర్థంకాదు. నేను ఆశగా ఇంటిలో ప్రవేశించాను. ఒక రాత్రి, ఒక పగలు తదేకదీక్షగా శాకుంతలంకోసం వెఱ్ఱిగా నిరీక్షించాను. వృథా! ఇది మోసం. నన్ను, శాకుంతలం పేరు చెప్పి మోసపుచ్చాడు. మోసపుచ్చినా నాకొచ్చిన నష్టం ఏంలేదు. ఎప్పటి 'నేనును' కాగలిగాను.

ఇప్పుడు పూర్వం పరిస్థితిలో ఉన్నాను. ఒక చక్రం దొర్లుఅయ్యింది. ఇంకెంతో లేదు చివరిఅంకం. దానికోసమే ఎదురు చూస్తున్నాను. ఎంత పెద్ద వాడినయ్యాను!

బామ్మగారికి పిల్లను అప్ప చెప్పాను. కాని... కాస్తోకూస్తో డబ్బు ఇవ్వవలసిన అగత్యం జ్ఞాపకానికి

రాలేదు అప్పుడు. విచారించాను. నా తెలివి తక్కువకు. నేను చేయవలసిన పని అంతా ఈ అంకంలోనే జరగాలి. నా తెలివి తెల్లారేలోపలే అన్నీ చక్కబెట్టుకోవాలి. రైలుకోసం నిరీక్షించుతూ ప్లాట్ ఫారంమీద బెడ్డింగుమీద కూర్చున్న ప్రయాణీకుడిలా ఉండాలి. ఇక నేను ఎటుపోయినా, కాదు...ఏ చావువచ్చినా, ఫరవా ఉండదనిపించింది. అందుకే మిగిలిన ఎకరం అమ్మజూపాను. అమ్మాను. రెండువేలు వచ్చింది. వెంటనే ద్రాక్షారామ ప్రయాణంకట్టాను.

అక్కడ!

బామ్మగారు ఉన్నట్టుండి పోయారట. మరి పిల్ల? ఎవరు తీసుకువెళ్ళారు? ఎవరో? ఏమో! ఏ అనాథ శరణాలయంలో నయినా ఉందేమో! భగవంతుడికే తెలియాలి? నా డబ్బుకూడా పనికిరాదన్న మాట. ఏ ఒక్కరికీకూడా ఈ ప్రపంచంలో నేను సహాయ పడకూడదేమో! నేనంత పాపిష్టివాణ్ణా?

నా ఇష్టమా? నేను ముగింపుకోసం ఎదురు చూస్తే మాత్రం వీలు కలగవద్దూ. నా సామానులు ఇంకా సర్దుకోకుండానే రైలు వస్తుందేమో! ఎవరు చెప్పగలరు? ఇంతకీ నా కథకు ముగింపు ఉండదా? అమ్మాయిజాడ నాకు తెలుస్తుందా? ఎక్కడ? ఎలా?...

అంతే...ఈ కథకు ముగింపు లేదేమో? లేక... అర్థాంతరంగా ఇదే ముగింపా? కాని...ఎప్పటికయినా నేను నా కూతురును, కనుక్కోలేక పోయినా, అదే, నన్ను వెతుక్కుంటూ రాగలదనే మొండిధైర్యం నాకుంది? ఎలా తెలుసుకోగలదని నేను ప్రశ్న వేసుకున్నా, తలచినా, కొయ్యబారిపోతాను శిలా ప్రతిమలా!